క్లుప్తంగా

రేపు గిరిజన సంఘం సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గిరిజన సంఘం(7856/2001) సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ(సీఈసీ) సమావేశాన్ని ఆదివారం గోదావరిఖనిలో ఏర్పాటు చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఆంగోతు భాస్కర్‌రావు, నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, చీఫ్ లైజన్ ఆఫీసర్, ఏరియాల బాధ్యులు పాల్గొనాలని కోరారు.

ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయాలి

ఇల్లెందు: సింగరేణి ప్రభావిత ప్రాంతాలను ప్రధానమంత్రి ఖనిజ క్షేత్ర కల్యాణ యోజనా పథకం జిల్లా మినరల్ ఫౌండేషన్ ద్వారా సింగరేణి ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణి మండలం పేరుతో సింగరేణి కంపెనీ సాగుతుందని, ఆ మండలంలోని ఉసిరికాయలపల్లి, టేకులగూడెం, తొడిదెలగూడెం, మడంపల్లి గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని తెలిపారు. నాలుగైదు ఏళ్లుగా వినతి పత్రాలు అందజేస్తున్నా కలెక్టర్ ఇతర సింగరేణి అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

బీజేపీ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా రజత్

ఇల్లెందు: భారతీయ జనతా పార్టీ అనుబంధ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇల్లెందు పట్టణానికి చెందిన రజత్ కోరీని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజత్‌కోరీ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో యువ మోర్చా జిల్లా నాయకత్వంకు ఎంపిక చేయటం పట్ల మరింత బాధ్యత పెరిగిందని, తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

జూలూరుపాడు: వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులు మిర్చి, యాసంగి వరి, కూరగాయ పంటలు సాగు చేస్తున్న దృష్ట్యా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. వారం రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో కరెంటు ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అదేవిధంగా అప్రకటిత విద్యుత్ కోతలతో వ్యవసాయ మోటార్లు కాలిపోయే ప్రమాదం ఉందన్నారు.

కాలం చెల్లిన యంత్రాలతో కాలయాపన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో పరిధిలోని సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో కాలం చెల్లిన యంత్రాలతో కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఏఐటీయూసీ నాయకులు వంగా వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రతీ యేటా కార్మికుల సంక్షేమానికి కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తూ అంకెల గారడీ చేస్తుందని, కానీ ఆ ప్రకటనలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని పేర్కొన్నారు. రక్తపరీక్ష మిషన్ యూనిట్ రెండు నెలలుగా పనిచేయడం లేదని, తద్వారా రోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఆస్పత్రిలో యంత్రాలను అందుబాటులో ఉంచాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని తెలిపారు.

'ఉపాధి' పనులపై గ్రామసభలు

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీలో సామాజిక తనిఖీ బృందం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల నిర్వహణపై గ్రామసభలు నిర్వహించారు. మండల పరిధిలోని ప్రభాత్‌నగర్, తవిశలగూడెం, పాండురంగాపురంతండా గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం సీఆర్‌పీ చారి గతేడాది జరిగిన ఉపాధి హామీ పనుల్లో విషయంలో ప్రజలు నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. ఏపీఓ రంగా, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

టేకులపల్లి: ఇఫ్టూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూయూ) రాష్ట్ర 7వ మహాసభ ఈనెల 29న కొత్తగూడెంలోని షాదీఖానా (ఉర్దూఘర్)లో జరుగుతుందని అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టేకులపల్లి ఏరియా కార్యదర్శి రాయండ్ల కోటిలింగం పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కోయగూడెం ఓపెన్‌కాస్టు ఓబి, కోల్ క్యాంపులు, ప్రీవేబిన్, కాటా తదితర ఏరియాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు, హక్కుల సాధనకు ఐఎఫ్‌టీయూ అనేక పోరాటాలు చేసిందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు పాలకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు.

గ్రామానికి సేంద్రియ సంపద

- ఆదర్శంగా నిలుస్తున్న 3 ఇంక్లైన్ జీపీ
- చెత్త నుంచి సంపద సృష్టిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న వైనం
- పంచాయతీకి అధికారుల ప్రశంసలు



ఎరువు కొనుగోలు చేస్తున్న రైతులు



సిద్ధమైన ఎరువును జల్లెడ పడుతున్న సిబ్బంది

చుంచుపల్లి: గ్రామాల్లో ట్రాక్టర్‌తో ఇంటింటికి సేకరించిన చెత్తను సద్వినియోగం చేసుకుంటూ ప్రకృతికి వినియోగించాలనే లక్ష్యంతో రూపొందించిన డంపింగ్ యార్డుల్లో సేంద్రియ ఎరువు తయారీపై ప్రజా ప్రతినిధులు, అధికారులు తగిన శ్రద్ధ చూపడంతో సత్ఫలితాలు వస్తున్నాయి. ఇందుకు కొంత మేరకు ఆసక్తి చూపి చెత్త ద్వారా ఎరువు తయారు చేసిన పంచాయతీలకు మెరుగైన ఆదాయం సమకూరుతోంది. చెత్త సేకరణతో ఎరువును తయారుచేసే పనులు పక్కా ప్రణాళికల ప్రకారం అమలు చేస్తే సంపద సృష్టి తేలికగానే సాధ్యమవుతుందని పలు పంచాయతీలు నిరూపిస్తున్నాయి. ఈ లక్ష్యాలను సాధించుకోవడం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామానికి డంపింగ్‌యార్డును 2020లోనే నిర్మించింది. ఈ డంపింగ్ యార్డును పూర్తిస్థాయిలో వాడుకలోనికి తెచ్చుకొని ఘన వ్యర్థాలను సక్రమంగా నిర్వహణ చేస్తున్న గ్రామపంచాయతీల్లో చుంచుపల్లి మండలం 3 ఇంక్లైన్ గ్రామపంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది.

ఆదాయం రూ.30వేలకు పైగానే...

ఈ పంచాయతీలో 480 గృహాల పరిధిలో 2,600 మంది జనాభా ఉండగా, మరుగుదొడ్ల నిర్మాణం వందశాతం పూర్తయ్యింది. ఏడాది కాలంగా ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా కంపోస్టును తయారు చేసి రైతులకు విక్రయిస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. ఇప్పటివరకు సుమారు 2,000 కేజీల సేంద్రియ ఎరువును తయారు చేసి విక్రయించగా పంచాయతీకి రూ.30 వేల వరకు ఆదాయం వచ్చింది. కంపోస్ట్ పిట్స్ వేసిన తరువాత ఎరువు తయారయ్యేందుకు దాదాపు రెండు నెలల సమయం పడుతుంది. ప్రతీరోజు వచ్చిన చెత్త అలాగే మిగిలిపోతుండటంతో పంచాయతీ ద్వారా అదనపు పిట్స్ నిర్మించి వాటిలో కూడా ఎరువును తయారు చేస్తున్నారు. పంచాయతీ నుంచి గ్రీన్ అంబాసిడర్స్‌ను నియమించి ప్రతిరోజు సర్పంచ్, కార్యదర్శి పర్యవేక్షిస్తూ గ్రామ పంచాయతీ స్థాయిలో సమర్థవంతంగా ఘన వ్యర్థాల నిర్వహణ చేస్తూ జిల్లా, మండల స్థాయి అధికారుల మన్ననలు పొందుతున్నారు.

ప్రతీరోజు చెత్త సేకరణ



ప్రతిరోజు ఉదయం 6 గంటలకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తుంది. సేకరించిన చెత్తను నిత్యం డంపింగ్‌యార్డుకు తరలించేలా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. గ్రామ ప్రజల్లో కూడా పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం. ప్రజల సహకారంతో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి నిరంతరం కృషి చేస్తున్నాం.

– ఆంగోతు మోతి, సర్పంచ్, 3 ఇంక్లైన్

ప్రత్యేక దృష్టి సారించాం



గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించిన తరువాత తడి చెత్త,పొడి చెత్తను వేరు చేయిస్తున్నాం. ఘనవ్యర్థాల నిర్వహణ అనేది సున్నితమైన అంశం దీనిపై కాబట్టి ప్రత్యేక దృష్టి సారించినందుకే మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రజలు కొంత అవగాహనతో తడి పొడి చెత్తను ఇండ్లలోనే వేరు చేసి ఇవ్వగలిగితే ఘన వ్యర్థాల నిర్వహణ సులభమవుతుంది.

– పాషా, పంచాయతీ కార్యదర్శి

ఘన వ్యర్థాల నిర్వహణకు సిబ్బంది



గ్రామస్థాయిలో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. డంపింగ్‌యార్డుల్లో ఈ ప్రత్యేక సిబ్బంది ద్వారా తడి పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేయడం నేర్పించాం. ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తూ ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. 3 ఇంక్లైన్ పంచాయతీ మంచి ఫలితాలను సాధిస్తోంది.

– సకినాల రమేష్, ఎంపీడీఓ

హక్కుల సాధనకు ఉద్యమిస్తాం..



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పాల్వంచరూరల్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, మార్చి 1, 2, 3వ తేదీలో మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె.రమేష్ అన్నారు. మండల పరిధి బస్వతారాక కాలనీలోగల ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సీడీపీఓ కనకదుర్గకు అందజేశారు. అనంతరం పట్టణ కార్యదర్శి కె.సత్య అధ్యక్షతన జరిగిన సభలో రమేష్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. సీఎం గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పి.వెంకటరమణ, రమ్య, అచ్చమ్మ,హేమలత, కృష్ణకుమారి, లక్ష్మీ, జయ, ప్రసన్న, ఉమా, మేరి, నాగమణిలు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: తొమ్మిదోమైలుతండా నుంచి బొమ్మనపల్లి వరకు ప్రధాన రహదారి వెంబడి డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీటితో రోడ్డు పక్కన బురద గుంటలు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై ఈనెల 24న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించి పంచాయతీ అధికారి బురద గుంటలో మొరం పోయించారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

చుంచుపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చుంచుపల్లి ఎంపీడీఓ రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని పెనగడప పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. అనంతరం ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది ఆయనకు పరీక్షలు నిర్వహించి అందత్వాన్ని గుర్తించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి హనుమంతు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ చార్జీల విషయంలో ఏసీడీ పేరుతో ప్రజలపై అదనపు చార్జీల భారాలను మోపడం సరైందికాదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. శుక్రవారం విద్యుత్ డిఇ కార్యాలయం ఎదుట కండ్లకు గంతలు కట్టుకుని, చేతుల్లో ప్లేకార్డులు పట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం సబ్ ఇంజనీర్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సాయి, నాగుల రవికుమార్, తాటిపాముల హరికృష్ణ, అముదాల భరత్, ఆకుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

29న ప్రగతిశీల రైతు సంఘం కౌన్సిల్

పాల్వంచ: ఈనెల 29న పాల్వంచలోని వరలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో జరిగే అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు నూపా భాస్కర్, పూనెం రమేష్, నిమ్మల రాంబాబు, పగిడిపల్లి సంజీవ రావు తదితరులు పాల్గొన్నారు

కార్మికుల శ్రేయస్సే లక్ష్యం

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల శ్రేయస్సే తమ యూనియన్ లక్ష్యమని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. పలు కార్మిక సంఘాలకు చెందిన నాయకులు టీఆర్‌వీకేఎస్‌లో చేరారు. వీరికి యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. 7వ దశ రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు తోట కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, రవికుమార్, విజయ్ శంకర్, రాజయ్య, పఠాన్‌ఖాన్, డి.రాంబాబు, సాధిక్ పాషా, రామారావు, బాబా, శేషం రాజు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను ఎత్తివేయాలి

ఇల్లెందురూరల్: వ్యవసాయానికి విద్యుత్ కోతలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాపంథా ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం మండలంలోని కొమరారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా మండల కార్యదర్శి నాయిని రాజు మాట్లాడుతూ.. యాసంగిలో 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శ్రీరాంకోటయ్య, వాంకుడోత్ శంకర్, బుర్ర రాఘవులు, వజ్జ వీరభద్రం, ఎలుగు శాంతారావు, కోరం ముత్తమ్మ, ఇస్లావత్ కోటేష్, బాలు, భద్రు, రవికిరణ్, లక్ష్మయ్య, సమ్మయ్య, రాంబాబు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌కు సన్మానం

చుంచుపల్లి: గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కొత్తగూడెం సొసైటీకి ఉత్తమ అవార్డు పొందినందుకు గానూ సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావును శుక్రవారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాథరావు, సొసైటీ డైరెక్టర్లు వేల్పుల మల్లేష్, బండి అమృతరావు, గూగులోతు చందర్, తీట్ల విజయ కుమారి, పోటు వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాసరావు, కంటెం సత్యనారాయణ పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల పంచాయతీ దుబ్బతండాకు చెందిన బానోత్ భద్రు అనే రైతుకు చెందిన వరిగడ్డి వామి దగ్ధమైన సంఘటన శుక్రవారం జరిగింది. బాధిత రైతుభద్రు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి ఆవరణలో ఉన్న వరిగడ్డి వామికి నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. స్థానికులు వచ్చి గడ్డివాముకు మంటలను ఆర్పివేసినప్పటికీ సుమారు రూ 20 వేల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన గుర్తుతెలియని కొందరు నిప్పు అంటించారనే అనుమానంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు పేర్కొన్నారు.

టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలు



ఇల్లెందు: టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలు



సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ కార్యాలయంలో..

ఇల్లెందు: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఇల్లెందులోని అన్ని మైన్ల మీద డిపార్ట్‌మెంట్ల మీద జెండాలు ఆవిష్కరించి కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు ఎస్. రంగనాథ్, సెంట్రల్ కమిటీ నాయకులు కోటిరెడ్డి, సంజీవరావు, దరియాసింగ్, చంద్ర వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, గౌస్, ప్రభాకర్, బోలాకుమార్, రాజు, మేకల శంకర్, రమేష్, అశోక్, జాఫర్, సర్వన్, శ్రీనివాసరెడ్డి, కోటయ్య, శ్రీను, లక్ష్మణ్, రాము, సాంబ, సంజీవ్, శ్రీను పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా, కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాల పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్‌ల్లో టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలను ఆయా ఉపాధ్యక్షులు నిర్వహించారు. కార్పొరేట్ ఏరియాలో ఎం.సోమిరెడ్డి, కొత్తగూడెం ఏరియాలోని టీబీజీకెఎస్ కార్యాలయంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ జెండా ఆవిష్కరించారు. 11 మెన్ కమిటీ సభ్యులు కాపు కృష్ణ, రీజియన్ కార్యదర్శి కూసన వీరభద్రయ్య, నాయకులు రాజయ్య, గౌస్, సత్తార్‌పాషా, కుమార్, శంకర్, నటరాజ్, నర్సింగం, సదానందం, రాజేశ్వరరావు, జల్లి కిరణ్, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉంటుందని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సూచించారు. మండలంలోని విజయలక్ష్మినగర్, తిలక్‌నగర్ గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అఖండ మెజారిటీతో గెలిపించుకునేలా పనిచేయాలన్నారు. విజయలక్ష్మినగర్, తిలక్‌నగర్ గ్రామ పంచాయతీలకు సంబంధించి సింగరేణి క్వార్టర్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పక్షాల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరినవారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఉపసర్పంచ్ తాంద్ర నాగరాజు అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో నాయకులు దిండిగాల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, దాస్యం ప్రమోద్, సదా, రాజేశ్వరి, చిన్నారి, ముస్తఫా పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన నామా



చెక్కు అందజేస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గుమ్మడి వెంకటేశ్వర్లు మనవడి లివర్ సర్జరీకి వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.3.40 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు శుక్రవారం ఖమ్మంలోని ఆయన నివాసంలో అందజేశారు. ఈకార్యక్రమంలో యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు గోపాలకృష్ణమూర్తి, లకావత్ గిరిబాబు, మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, సర్పంచ్‌లు భూక్యా రాములు, లక్ష్మీ, బాలాజీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'జీతాలు లేక బతకటం ఎలా?'

టేకులపల్లి: గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ భద్రాచలం పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు గతేడాది సెప్టెంబర్ నెల నుంచి నేటికీ జీతాలు లేకపోవడంతో వారికి కుటుంబ పోషణ భారంగా మారిందని, జీతాలు లేకపోతే వారు బతకటం ఎట్లా అని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కోయగూడెం ఆశ్రమ పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఐటీడీఏ భద్రాచలం పరిధిలో తొలగించబడిన సీఆర్టీలందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ ముత్తయ్య, మండల కార్యదర్శి ఎం.శారద, ఉపాధ్యాయులు కస్నా, సీహెచ్.జానకీ, బిచ్చ పాల్గొన్నారు.

వైఎస్సార్ టీపీతోనే సంక్షేమ పాలన

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, ఈ పాలన నుంచి విముక్తి చెందాలంటే వైఎస్సార్ టీపీని ఆదరించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు గడిపల్లి కవిత అన్నారు. మండలంలోని నారాయణరావుపేటలో శుక్రవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 110 కుటుంబాలు యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సాయిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరినట్లు కొత్తగూడెం నియోజకవర్గ కోఆర్డినేటర్ ఖలీల్‌పాషా తెలిపారు. పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించాక కవిత మాట్లాడారు. జిల్లా అధికార ప్రతినిధి ఎస్.కిరణ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, హుస్సేన్, పండు, ప్రదీప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో విఫలం

టేకులపల్లి: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ)జిల్లా నాయకులు నోముల కళావతి, భూక్య చిన్ని విమర్శించారు. ఈనెల 28న కొత్తగూడెంలో పీఓడబ్ల్యూ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళలపై దాడులకు వ్యతిరేకంగా, మహిళా రిజర్వేషన్ చట్టం కోసం, సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మండల గౌరవ అధ్యక్షురాలు నోముల కళావతి, అధ్యక్షురాలు తోటకూరి చిట్టెమ్మ, కార్యదర్శి చింత లాలమ్మ, ఉపాధ్యక్షురాలు పెనక లక్ష్మీ, సహాయ కార్యదర్శి జారలక్ష్మీ, కోశాధికారి భూక్య చిన్ని, బోడ మంగ, అలివేలు, లక్ష్మీ,కౌసల్య పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



సంతకాల సేకరణ ప్రారంభిస్తున్న నాయకులు

ఇల్లెందు: బీఎస్పీ ఇల్లెందు నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బీసీ కుల గణన, 52శాతం రిజర్వేషన్ పెంపుదల కోసం సాగుతున్న ఈ కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బీసీ కుల గణన చేపట్టాలని, చట్ట సభల్లో బీసీలకు 52శాతం రిజర్వేషన అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి కాంతారావు, రాయల శ్రీనివాసరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, జ్ఞాన సుందరం, రాంప్రసాద్, లోకేష్, కిరణ్, బట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు కేటాయించే వరకు ఆందోళన

ఇల్లెందురూరల్: బాలాజీనగర్ గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలోని ఖాళీ స్థలాన్ని పేదలకు ఇంటి స్థలాల కోసం కేటాయించాలని కోరుతూ పేదలుచేస్తున్న ఆందోళన శుక్రవారం రెండోరోజు కొనసాగించారు. స్థలంలో గుడిసెలు వేసుకునేందుకు పేదలు యత్నించగా విషయం తెలుసుకున్న సింగరేణి సెక్యూరిటీ అధికారులు హుటాహుటిన ఆ స్థలం వద్దకు వచ్చి పేదలను అక్కడి నుంచి ఖాళీ చేయించారు. దీంతో సమస్యను ప్రజాప్రతినిధులతో వివరించే ప్రయత్నం చేశారు. వారు అందుబాటులో లేకపోవడంతో ఖాళీ స్థలం వద్దే టెంటు వేసుకొని ఇంటి స్థలాలు చూపించాలనే డిమాండ్‌తో ఆందోళన కొనసాగించారు.

జీఎంకు వినతి

సింగరేణి(కొత్తగూడెం): సీఈఆర్ క్లబ్ నామ్స్‌కు వ్యతిరేకంగా డబ్బులు డ్రా చేసిన విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఏరియా జీఎం జక్కం రమేష్‌కు హెచ్ఎంఎస్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గుర్తింపు సంఘం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో అన్ని యూనియన్ నాయకులను పిలిచి సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండగా, సీఈఆర్ క్లబ్ నామ్స్‌కు వ్యతిరేకంగా ఏకపక్ష నిర్ణయం తీసుకొని డబ్బులు డ్రా చేయటం సరికాదన్నారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ఏరియా బ్రాంచి సెక్రెటరీ ఆసిఫ్, నాయకులు అజయ్ బాబు, రామ్ శ్రీనివాస్, బాలచందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నియామకాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో గిరిజనులతోనే ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉండగా హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు సమీప బంధువైన ఎస్.దుర్గా భవానీకి నోటిఫికేషన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఏఎన్ఎం ఉద్యోగం ఇచ్చారన్నారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్‌సెంటర్‌లో అన్నపురెడ్డిపల్లి ఏఎన్ఎంగా నియమిస్తూ జిల్లా ఆరోగ్య శాఖ అధికారి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీనికి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదాల మలుపు..!



విజయవాడ - భద్రాచలం జాతీయ రహదారిలోని పెనగడప వద్ద మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ రహదారి గుండా వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. వాహనాలు తీరా దగ్గరకు వచ్చేవరకు కనిపించకుండా ఈ మూల మలుపు ఉంది. గతంలోనూ ఇక్కడ భారీ ప్రమాదాలే చోటు చేసుకున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు - చుంచుపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : బి.హనుమంతు, పంచాయతీ కార్యదర్శి, పెనగడప
సెల్ నంబర్ : 97012 50276